# దర్గామిట్ట కతలు

# పాపాలన్నీ మాయమ్మకేనంట!

రాత్రిపూట నీళ్లుబోసుకొని మా నాయిన అన్నానికి కూచున్నాక ఎవ్వళ్లేంది మా అమ్మ ఒళ్ళు బాగుండని సంగతి జెప్పకుంది.

'ఈ మద్య ఒళ్ళేమీ బాగుళ్లేదుబా. ఒకటే కాళ్లు పీకడం, ఒళ్ళు నొప్పలు. బాయి లోంచి రొండు బిందెలైనా నీళ్ళు చేదలేకపోతున్నా' అంది, మా నాయిన బాసన్లో ఎర్రగెడ్డల పులుసు బోస్తా.

మా నాయిన మా అమ్మ ముకం కల్లా జూసి నవ్వినాడు.

'చూడుమా దీని డావులు. రొండు దినాల్లో రంజాను వెల వొస్తా వుంటే మొదలెట్టిందా. రోజా (వక్కపొద్దు) లు బెట్టేది ఎగమూకడానికేగా యిదంతా' అన్నాడు మా నాయినమ్మతో నవ్వతావే.

'ఆ మనిషి ఎప్పుడూ అంతేగదబయా. ఒక రోజైనా రోజా వుండుమే అంటే ఒద్దంటే ఒద్దంటది. రోజాలు బెడితే నీరసమొచ్చి తట్టుకోలేదంటా అమ్మ తల్లి' మొత్తకానుకొని కూచుని, తుస్కారం చేస్తా మాట్లాడింది మా నాయినమ్మ.

'ఈమారు ఎట్టాగయివా దీని చేత ముప్పయి రోజాలు బెట్టించాల్సిందేమా. దెబ్బకు నొప్పలు గిప్పలన్నీ ఎగిరిపోతాయి' అన్నాడు మా నాయిన యింకొస్త చతుర్లాడతా.

'ఈ మనిషి కత సరేనబయా. పెద్దోడికి పదమూడు బోయి పద్నాలుగు రాబోతా వున్నాయి, ఈ ఏడైనా రోజాలు బెగిను బెట్టించకపోతే ఎట్టా' అంది, మా నాయినమ్మ.

మా అన్న ప్రస్తావన వొచ్చే సరికి మా అమ్మ ఒళ్లునొప్పల డ్రామాలన్నీ పక్కనబెట్టి నికార్సయిన మస్తాన్ సాయిబు కూతురి అవతారం ఎత్తేసింది.

'మ్మో... తాలట్టా. బలే నెయ్యా మూక్యా యేసి పెంచతా వున్నావనా? పచ్చడి మెతుకులకే యీడ గతిలా. యిట్టాంటి తిండికి యింక రోజాలు గూడా బెట్టించినావంటే బిడ్డ చేతికందే దానికేనా. మా నాయిన ఎన్నడూ మా చేత రోజాలు బెట్టించలా. నేను గూడా నా బిడ్డల చేత రోజాలు బెట్టించను' అంది తెంపుగా.

(మా అమ్మనాయిన మస్తాన్ సాయిబు చాలా బయస్తుడు. బిడ్డలు రోజాలు బెట్టి యాడ కిందా మిందా అయిపోతారో అని ఆయన పొరపాటున గూడా మా అమ్మోళ్ల చేత రోజాలు బెట్టించేవాడు కాదంట. 'పుణ్యాం సంగతి దేవుడెరుగు. నా బిడ్డలు రోజాబెట్టి చుక్క నీళ్లు కూడా తాగకుండా వుంటే నేను చూసేదానికేనా?' అనే వాడంట)

ఈలోగా మా అన్న తగులుకునేసినాడు.

'మో...మో... ఈసారి వేనుంటానుమా రోజా. నాకు బలే యిష్టంమా. సాయింత్రం మసీదులో రోజా యిప్పినాక తినడానికి బలే బలేవి పెడతారుమా. నేనుంటానుమా' అన్నాడు బతిమిలాడతా.

రంజాను వక్కపొద్దలు వున్నోళ్లలో కొందరు సాయింత్రమయివాక మసీదులో రోజా యివ్వతారు. వాళ్ల కోసరమని (పుణ్యాం వొస్తుందని) మావోళ్లలో చాలా మంది దానిమ్మ కాయిలు, పుచ్చకాయలు, ద్రాక్ష, పాయిసం, అంబలి యింకా ఏందేందో పంపుతారు. పొద్దనంతా వక్కపొద్దున్నా సాయింత్రానికి అయన్నీ దక్కతాయిగదా అని మా అన్న ఆశ.

మా అమ్మ మా అన్న మాటల్ని పడనీలా.

'ప్రాణాలు తోడేస్తా ఏవనుకుంటున్నావో. ఈ నట్టనడెండల్లో రోజా బెట్టి మవు బతకడానికేనా' అంది గదమాయిస్తా.



'చూడుమా యీ హరాం ముండ మాటలా. సాయిబు వుటకబుట్టి రోజా వొద్దంటుందే... వేరుగా నరకానికేపోయి నస్తదిది' అన్నాడు మా వాయిన.

ఆయవ ఏ కళన వున్నాడోగాని మా అమ్మను ఏడ్పించడమే పనిగా బెట్టుకున్నాడు.

మా అమ్మ జవాబు చెప్పకుండా గమ్మమండిపొయ్యింది. అందరం అన్నాలు తిన్నాక దొడ్లో మంచాలు ఏసింది.

మంచి ఎండాకాలం రాత్రి.

గుత్తులు గుత్తులుగా కాసిన మావిడి చెట్టు మింద నుంచి తెల్లంగా కాస్తా వుంది ఎన్నెల. మా ఇల్లు గల్లోళ్లు అమీర్‌మామూ-జైతూన్ ఆపా ఒక తట్టు మంచాలేనుకోనున్నారు.

మా నాయినమ్మ మా అన్నను పొణుకోబెట్టుకొని ఏదో కత మొదలుబెట్టింది.

మా చెల్లెలు, మా తమ్ముడు మా నాయిన మంచం మింద నిద్రపోతా వున్నారు.

నేను మా అమ్మ పక్కన పొణుకొని మావిడికాయల తట్టు చూస్తా వున్నా.(వాటిని చూడ్డానికే గానీ తాకడానికి లా. యింటి బాడిగ నలబై రూపాయిలకు పెంచడానికి మా నాయిన ఒప్పకోకపొయ్యేసరికి మాకు రాలిన పిందెలుగూడా యియ్యట్లేదు అమీర్‌మామూ)

రొంత సేపు తాలివాక మా నాయినొచ్చి మా మంచం చివర కూచున్నాడు.

'సరే అయితే. పెద్దోడి చేత వొద్దుగానీ నువ్వన్నా ఈ మారు రోజాలు బెట్టు' అన్నాడు మళ్లా ఉడికించడానికి.

మా అమ్మ చప్పన లేచి కూచుంది.

'నీకు సలాం బెడతా నాయినా... ఆమాట ఒదిలిపెట్టు. నీకేం...రోజూ తెల్లారి లేచి కూటికీ నీళ్లకీ అయిదు రూపాయిలిస్తే యిస్తావు, లాకుంటే అదీలా. నేనుగదా అప్పోసప్పో జేసి, శెట్టికి యివ్వడిస్తా అవ్వడిస్తానని అబద్దాలు జెప్పి టయానికి అన్నం దబరదించి పెట్టాల్సింది. మీ అమ్మ గరావా వొంశస్తురాలు. ఎవుర్ని చేయిసాపి అడగదు. కన్నందుకు నాకేగా బట్టింది?' అంది చెడామడా యిదలేస్తా.

మా నాయిన బిత్తరపోయినాడు.

'నేనిప్పుడు ఏవన్నాననిమే'... అని ఏదో అనబోతా వుంటే, కదువు మంట తీరక మా అమ్మ మళ్లా అందుకుంది.

'మొన్న మవు చేపలిప్పించి దర్జాగా మూక్కోబోయినావే... మావె యాణ్ణుంచి వొచ్చిందనుకున్నావు నాయినా? కుర్షీదక్క చూడకుండా వాళ్లింట్లోంచి దొబ్బకొచ్చిగదా కూర చేసింది. రొండ్రోజులకొక సారి మా అమ్మోళ్లింటికి బొయ్యి ఆ వలాతూన్ ముండ (మా అమ్మమ్మ) చూడకుండా బస్తాలో బియ్యం లోడుకొని రాకపోతే వా బిడ్డలకు ముద్దబెట్టడం యాడ అయ్యేపనేవా. అంతెందుకా? ఈ నెలరోజుల్లో ఈ మావిడకాయలు(పైకి చూపిస్తా) దొబ్బకుండా మనింట్లో పచ్చడి చెయ్యడం వా వొల్లగాదంటే వొల్లగాదే. పయిత్రమైన రోజాలు బెట్టి యిట్టాంటి పనులన్నీ నేను చెయ్యలేనుగానీ నువ్వూ మీ అమ్మా

ఆ రోజాలేవో వుండి పుణ్యాం మూటగట్టుకోండి. నేను నా బిడ్డలకు కదువు నిండుగా తిండిబెట్టుకొని పాపం నింపుకంటా' అంది.

– మహమ్మద్ ఖదీర్‌బాబు